గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

మహేశ్వరం జనసంద్రం.. జైకొట్టిన జహీరాబాద్

- దద్దరిల్లిన పటాన్‌చెరు.. విజిలేసిన వికారాబాద్
- సీఎం కేసీఆర్ సభలు సక్సెస్
- వర్షంలోనూ కదిలివచ్చిన ప్రజలు
- మిన్నంటిన నినాదాలు.. ఆసాంతం హర్షాతిరేకాలు

సిద్దిపేట, నవంబర్23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/రంగారెడ్డి/వికారాబాద్/సంగారెడ్డి: జన నినాదాలతో మహేశ్వరం నియోజకవర్గం మార్మోగింది.. వికారాబాద్ జనసంద్రమైంది.. కదిలొచ్చిన ఊరూవాడ జనంతో పటాన్‌చెరు దద్దరిల్లింది.. జహీరాబాద్ జైకొట్టింది.. గురువారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు విజయవంతమయ్యాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షం కురుస్తున్నా జనం దండులా తరలిరావడంతో జన జాతరను తలపించింది. వృత్తిదారుల వేషధారణలు, బతుకమ్మ, బోనాల నృత్యాలతో కళాకారులు సందడి చేశారు. సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేసిన సందర్భంలో ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. ఈలలు, చప్పట్లతో సభాప్రాంగణం మార్మోగింది. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మెతుకు ఆనంద్ అధ్యక్షతన జరిగిన సభకు అన్నిగ్రామాల నుంచి జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. భారీ జనం చేరడంతో వికారాబాద్ పట్టణమంతా జనసంద్రంగా మారింది. నియోజకవర్గమంతటా ఒకేసారి దళితబంధు మంజూరు చేస్తామని, ఐటీని విస్తరిస్తామని హామీనివ్వగా చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. రైతుబంధును పుట్టించింది కేసీఆర్ అనగా, ప్రజలంతా జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు అధ్యక్షతన జరిగిన సభతో పట్టణమంతా గులాబీమయమైంది. తండాలు, పల్లెలు, అన్ని వార్డుల నుంచి జనం గులాబీ జెండాలు, ప్లకార్డులు చేతబూని సభకు తరలివచ్చారు. వికారాబాద్‌లో చెల్లని రూపాయి.. జహీరాబాద్‌లో చెల్లుతుందా.. అని కాంగ్రెస్ అభ్యర్థి గురించి సీఎం కేసీఆర్ అనగానే చప్పట్లు మార్మోగాయి. లోకల్ లీడర్ కావాలి.. అంటూ జనం నినదించారు.

హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న జన నేత

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ మైదానంలో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు వేలాది మంది తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. నియోజకవర్గంలోని గుమ్మడిదల, జిన్నారం, బొల్లారం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ముఖ్యంగా కార్మికులు, ముఖ్యంగా ఉత్తరాదికి చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ హయాంలో పటాన్‌చెరు పారిశ్రామికవాడలో నెలకొన్న కాలుష్యం, తాగు, సాగునీటి సమస్యల గురించి వివరించినప్పుడు ప్రజల్లో నిజమేనన్న ఆలోచన కలిగింది. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ప్రముఖ కార్మిక నాయకుడు ఎల్లయ్యతో సీఎం కేసీఆర్ కరచాలనం చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తన ప్రసంగంలో ఎల్లయ్య తన ఆప్తమిత్రుడని గుర్తు చేశారు. ఉత్తరాదీలకు అర్థమయ్యేలా హిందీలో ప్రసంగించి ఆకట్టుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉండే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంతో ఆనందంతో చేతులెత్తి హర్షం వ్యక్తం చేశారు. మధుప్రియ, మానుకోట ప్రసాద్ ఇతర కళాకరుల బృందాల ఆటాపాటలతో సభాప్రాంగణాల్లో జనం ఆడిపాడారు. గులాబీ జెండాలే రామక్క పాటకు ఎక్కడికక్కడ నాయకులు, గులాబీ శ్రేణులు ఉత్సాహంగా గంతులేసి ఆడారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో నిర్వహించిన సభలో యువకుల ఉత్సాహం

బీఆర్ఎస్ సమ్మోహన సమ్మేళనం

- సభలకు పోటెత్తుతున్న జనం
- 82 సభలతో ప్రజామోదం పొందిన ముఖ్యమంత్రి కేసీఆర్
- కిక్కిరిసిపోతున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు
- సబ్బండవర్ణాల సంపూర్ణ మద్దతు
- గెలిపించి తీరుతామని ప్రతినలు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సభల సమ్మోహనం అప్రతిహతంగా కొనసాగుతున్నది. ఎన్నికల ప్రచార ముగింపు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొంటున్న ప్రజాఆశీర్వాద సభలు జనంతో పోటెత్తుతున్నాయి. మరోవైపు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు జన ఉప్పెనను తలపిస్తున్నాయి. వాటితోపాటు ఎక్కడికక్కడ అభ్యర్థుల ప్రచార సభలకు అన్నివర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. సబ్బండ వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. సీఎం కేసీఆర్ గురువారం నాటికి 82 సభలతో ప్రజలను నేరుగా కలుసుకొని ఆమోదం పొందారు. సభల్లో ఉద్యమకాలం నుంచి స్వరాష్ట్ర సాధన, అనంతర బీఆర్ఎస్ ప్రభుత్వం సాగించిన ప్రగతి ప్రస్థానాన్ని కండ్లకు కడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఆధారసహితంగా కేసీఆర్ వివరిస్తున్న తీరు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. కాంగ్రెస్ గత, వర్తమాన చరిత్రను కండ్లకు కడుతూ చేస్తున్న భవిష్యత్తు దర్శనం ప్రజల్లో స్పష్టతనిస్తున్నది.

కేసీఆర్‌కు ప్రత్యామ్నాయ నాయకత్వం కరువు

సభలకు హాజరైన ప్రతీ ఒక్కరు బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ నాయకత్వానికి ప్రత్యామ్నాయం లేదనే నిశ్చితాభిప్రాయానికి వస్తున్నారు. తెలంగాణను కేసీఆర్ కన్నా మిన్నగా ప్రేమించి, ఆరాధించే నాయకుడు మరొకరు కనిపించడం లేదని బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలు తేటతెల్లం చేస్తున్నాయి. నాడు ఉద్యమంలో అయినా, నేడు ప్రభుత్వంలో ఉన్నా తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల బీఆర్ఎస్‌కు ఉన్న చిత్తశుద్ధి మరో పార్టీకి లేదని నిరూపితమైంది. ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని సాధికారికంగా చెప్పగలిగే సత్తా ఒక్క బీఆర్ఎస్‌కే మినహా మరో పార్టీకి లేదని ప్రజ లు స్థిర అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నారు. కేసీఆర్ ప్రసంగాల సందర్భంగా జనం నుంచి వ్యక్తమవుతున్న స్పందనే అందుకు నిదర్శమని విమర్శకులూ కాదనలేకపోతున్నారు.

సంక్షేమం చేరని ఇల్లు లేదు: వీ ప్రకాశ్

కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఎలా కడనగలమని పేర్కొంటుండటం ప్రజాఆశీర్వాద సభల ప్రత్యేకతగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు వీ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. బలవంతంగా వచ్చిన వారైనా కేసీఆర్ ప్రసంగాల్లో చెప్పే విషయం అవునా, కాదా అని అంచనావేసే వివేచన తెలంగాణ సమాజంలో ప్రబలంగా ఉన్నది.. అని ఆయన విశ్లేషించారు. తెలంగాణలో హనుమంతుడి గుడి లేని ఊరులేదు. కేసీఆర్ సంక్షేమ పథకాలు చేరని ఇల్లు లేదు' అనే నానుడి స్థిరపడి పోయిందని తేల్చిచెప్పారు. కొన్ని ప్రేరేపిత శక్తులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలకు కేసీఆర్ పట్ల స్పష్టమైన అవగాహన ఉన్నదని చెప్పారు. దీంతో ప్రజాఆశీర్వాద సభలకు యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని తెలిపారు.

స్థిరమైన ప్రభుత్వం, దృఢమైన నాయకత్వం

గత నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలకు అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన 82 సభలు జనసంద్రాన్నే తలపించాయి. ఈ సభలకు వచ్చిన వారు స్థిరమైన అభిప్రాయంతో తిరిగి వెళ్తున్నారు. స్థిరమైన ప్రభుత్వాన్ని, దృఢమైన నాయకత్వాన్ని తామెందుకు జారవిడుచుకుంటామని నిర్ణయించుకుంటున్నారు. ఇదే విషయాన్ని బాహాటంగానే తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు.

ప్రజల మనసు గెలిచి తీరాల్సిందే..

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా ఉన్న గులాబీ సైన్యంలో పట్టుదల కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. తమ నియోజకవర్గ అభ్యర్థిని గెలిపించుకోవడం కోసం అన్ని స్థాయిల గులాబీ శ్రేణులు ఇల్లిల్లూ తిరుగుతూ మనిషి మనిషిని కలుస్తున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని కండ్లకు కడుతూ ప్రజా మద్దతును కూడగట్టడంలో బీఆర్ఎస్ స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా పనిచేస్తున్నారు. ప్రతీ ఒక్కరూ తామే అభ్యర్థి అన్న రీతిలో గులాబీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ విషప్రచారాన్ని ఎక్కడికక్కడ గులాబీ శ్రేణులు తిప్పికొడుతున్నాయి.

మార్పు కోరేది రాజకీయ నిరుద్యోగులే

- కాంగ్రెస్ ఇక గతం.. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే
- ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజల్లో సడలని నమ్మకం
- తెలంగాణలో బలం లేని కాంగ్రెస్
- టీవీ చానల్ కాన్‌క్లేవ్‌లో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలెవరూ కోరుకోవడం లేదని, రాజకీయ నిరుద్యోగులు మాత్రమే మార్పు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒక చానల్ నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిజమైన మార్పు 2014లోనే వచ్చిందని, 2014లో అది మరింత ప్రబలమైందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అణచివేతకు గురైన తెలంగాణ ప్రజలు 14 ఏండ్లపాటు సీఎం కేసీఆర్ నాయకత్వంలో పోరాడి తెలంగాణ సాధించుకోవడమే అసలైన మార్పు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలోని కరువుకాటకాలు, గంజి కేంద్రాలు, నిరుద్యోగం, నక్సలిజం, దోపిడీని ప్రజలు మళ్లీ కోరకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అట్టర్‌ఫ్లాప్ కావడం వల్లే ఎన్టీఆర్‌ను ప్రజలు నెత్తినపెట్టుకొని 9 నెలల్లోనే అధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, సమాజంలో ఎన్టీఆర్ వచ్చాకే మార్పు వచ్చిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పాలనలో సామాజిక మార్పుతో పాటు ప్రజల జీవన పరిస్థితుల్లో కూడా పెను మార్పులు సంభవించాయని వివరించారు. ఎన్టీఆర్ తర్వాత ఆయన శిష్యుడైన కేసీఆర్ తెలంగాణలో రెండుసార్లు ముఖ్యమంత్రిగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, ఎన్టీఆర్ కూడా సాధించలేని ఘనతను ఆయన శిష్యుడు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికై చరిత్ర సృష్టించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

ఆ ప్రచారం మీడియా సృష్టే

సీఎం కేసీఆర్ నాయకత్వంపై ప్రజలు పూర్తి నమ్మకంతో ఉన్నారని, బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత మీడియా సృష్టి మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆరు నెలలకోసారి సీఎంలు మార్చే వారిని కాకుండా స్థిరమైన, బలమైన ప్రభుత్వాన్నే తెలంగాణ ప్రజలు కోరుకుంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీది హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఆదరణ లేదని పేర్కొన్నారు. బీజేపీ బలం తగ్గడం వల్లే కాంగ్రెస్ బలం పెరిగిందని అనుకుంటున్నారని వివరించారు. బీఆర్ఎస్ ఓటుబ్యాంకు చెక్కుచెదరలేదని, నంబర్ 2 స్థానం కోసమే కాంగ్రెస్, బీజేపీ పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపులో గొప్పతనం ఏమీ లేదని, 30శాతం కమిషన్ ప్రచారంతోనే బీజేపీ ఓడిందని విశ్లేషించారు. రేవంత్ రూ.50కోట్లు పెట్టి పీసీసీ పదవి కొనుకున్నారని, కోట్లకు టికెట్లు అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆరోపించారు. కాంగ్రెస్ ఇక గతమని.. బీఆర్ఎస్సే భవిష్యత్తు అని స్పష్టం చేశారు. భవిష్యత్తును కోరుకునే వారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.

గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌తో కలిసి మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం
- శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా విపక్షాల కుయుక్తులు
- గౌడన్నలకు చెట్ల పన్ను రద్దు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- త్వరలో గీత కార్మికులు అందరికీ ద్విచక్ర వాహనాలు అందజేస్తాం
- గౌడ సంఘం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాల్లో హరీశ్‌రావు

సంగారెడ్డి/సదాశివపేట, నవంబర్ 23: తెలంగాణలో తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై కాంగ్రెస్, బీజేపీ తట్టుకోలేక లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గుజరాత్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు రాహుల్‌గాంధీ అక్కడ భారత్ జోడో యాత్ర చేయకుండా పక్క రాష్ట్రాల నుంచి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. గురువారం ఆయన సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌తో కలిసి కంది మండల కేంద్రం శివారులో నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం, సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తొలుత సర్దార్ సర్వాయి పాపాన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గీత కార్మికులు మంత్రికి కల్లుగీసే మోకులు అందజేసి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని తట్టుకోలేక అలజడి సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. హిందువులు, ముస్లింల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మైనార్టీల సంక్షేమానికి తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం రూ.12 వేల కోట్ల నిధులు ఖర్చు చేసిందని వివరించారు.

చెట్ల పన్నులు రద్దు చేసిన ప్రభుత్వం

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే ఈత, తాటి చెట్ల పన్నును రద్దు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హరీశ్‌రావు చెప్పారు. గీత కార్మికులు మృతిచెందితే చెల్లించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచామని తెలిపారు. త్వరలోనే గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు (మోపెడ్)లు అందజేస్తామని భరోసా ఇచ్చారు. వైన్‌స్షాప్‌ల్లో గౌడ్లకు 15% రిజర్వేషన్ కల్పించామని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై రూ.3 కోట్లతో సర్దార్ సర్వాయి పాపాన్న విగ్రహం ఏర్పాటుచేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ ఎంఐడీసీ చైర్మన్, నిమోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎన్నికల కో ఆర్డినేటర్ పట్నం మాణిక్యం, టీఎస్జీవో మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కందిలో నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావుకు మోకు, తాళ్లు అందజేస్తున్న కార్మికులు

సదాశివపేట.. జన ప్రభంజనం

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌తో కలిసి నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు పోటెత్తారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. టూరిస్ట్‌లా సంగారెడ్డికి అప్పుడడప్పుడు వచ్చిపోయే ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. రోడ్‌షోలో ఎంపీపీ యాదమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, చీల మల్లన్న, పిల్లిగుండ్ల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మాడల్‌కు డిమాండ్

- తాగునీరు, విద్యుత్తు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాం
- గ్రామాలు, ప్రభుత్వ దవాఖానల్లో మార్పు తెచ్చాం
- పది రాష్ట్రాలకు తిండి పెడుతున్న ది తెలంగాణ రాష్ట్రమే
- రైతులను కాంగ్రెస్, బీజేపీ ఏనాడూపట్టించుకోలేదు
- టీవీ చానల్ కన్‌క్లేవ్‌లో హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మాడల్ దేశానికే దిక్సూచిగా మారిందని, ఇక్కడి పథకాలు తమకూ కావాలని ఇతర రాష్ట్రాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. వ్యవసాయరంగం విషయంలో కాంగ్రెస్, బీజేపీ విధానాలు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. గురువారం ఆయన ఒక న్యూస్ చానల్ నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో మాట్లాడుతూ.. 'తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది' అనే రీతిలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. రైతుబంధు, మిషన్‌భగీరథ పథకాలను కేంద్రం కూడా అమలుచేస్తున్నదని ఉదహరించారు. మిషన్ కాకతీయ పథకాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలోని ఏ ప్రభుత్వం కూడా ప్రజల అవసరాలను వందశాతం తీర్చలేదని చెప్పారు. గతంలో పరిపాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించలేదని, సీఎం కేసీఆర్ తాగునీరు, విద్యుత్తు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని వివరించారు.

మార్పు అంటే ప్రజల జీవన స్థితిగతులు మారాలి

మార్పు అంటే ప్రజల జీవన స్థితిగతులు మారాలని, పదవుల మార్పు కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామీణ, పట్టణ ప్రజల జీవన స్థితిగతులు మారాయని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పెరిగిందని, ప్రభుత్వ దవాఖానల్లో మార్పులు తెచ్చామని, మహబూబ్‌నగర్‌లో వలసలు ఆగిపోయాయని వివరించారు. దేశం మొత్తం భూగర్భజలాలు పడిపోయినా.. తెలంగాణలో 6.5 మీటర్ల నీటి మట్టం పెరిగిందని చెప్పారు. వేసవి వచ్చిందంటే అంబలి కేంద్రాలు ఉండే తెలంగాణ.. ప్రస్తుతం 10 రాష్ట్రాలకు తిండి పెడుతున్నదని పేర్కొన్నారు. తమకు బియ్యం సరఫరా చేయాలని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు లేఖలు రాస్తున్నాయని వెల్లడించారు. విద్యుత్తు మీటర్ల విషయంలో కేంద్రం రాష్ట్రాల మెడపై కత్తి పెట్టిందని విమర్శించారు. బోరుబావుల వద్ద మీటర్లు పెడితే 0.25 శాతం నిధులు అధికంగా ఇస్తామని చెప్పినా సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాల కోసం దానికి అంగీకరించలేదని స్పష్టం చేశారు. పెన్షన్లు తీసుకుంటున్న 45 లక్షల మంది, రైతుబంధు తీసుకుంటున్న 69 లక్షల మంది, కల్యాణలక్ష్మి తీసుకుంటున్న ఆడపిల్లలు, దివ్యాంగులు సీఎం కేసీఆర్‌ను అక్కున చేర్చుకొని ఓట్లు వేస్తారన్న విశ్వాసం వ్యక్తంచేశారు. వారి దీవెనలు తమకు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంలో లాభం పొందని ప్రజలే లేరని పేర్కొన్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్‌కే బీసీల మద్దతు

బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రకుమారస్వామి

హైదరాబాద్, నవంబర్23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే బీసీలు మద్దతు ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణలోని బీసీ మేధావులు, విద్యార్థులు, కులసంఘాల ప్రతినిధులు బీఆర్ఎస్ వైపు నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీ లాంటి జాతీయ పార్టీలతో బీసీలకు ఇప్పటివరకూ ఒరిగిందేమీ లేదని, ప్రాంతీయ పార్టీలతోనే బీసీ సమాజం కలిసి నడవాలని కోరారు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్, బీజేపీకి బీసీలు గుర్తుకు వస్తారని, ఆ తర్వాత గాలికొదిలేస్తాయని ఆరోపించారు. బీసీని సీఎంను చేస్తామని ప్రకటించిన బీజేపీది ఎన్నికల స్టంట్ అని పేర్కొన్నారు. కులగణన, బీసీ ప్రత్యేక మంత్రిత్వశాఖ తదితర అంశాల్లో బీసీలను బీజేపీ వంచించిందని మండిపడ్డారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నా కులగణనను చేయలేదని, బీసీల సంక్షేమానికి పాటుపడిందీ లేదని మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న, ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్న తెలంగాణ సీఎం కేసీఆర్‌కే తెలంగాణ బీసీ సమాజం మద్దతుగా నిలవాలని కోరారు.